క్లుప్తంగా

విద్యతోనే విలువలు

వనపర్తి రూరల్: వయోజన విద్యకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని, విద్య ఉంటేనే మనిషికి విలువ ఉంటుందని ఎంఈఓ జయరాములు అన్నారు. మంగళవారం పెబ్బేరు పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాల్లో వయోజన విద్యపై 'ఉల్లాస్' శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, ఆర్‌పీ రవికుమార్, దుర్గాప్రసాద్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి నివాళి

పాన్‌గల్: మాజీ ఎంపీపీ ముంతరాములుయాదవ్ మృతికి పలువురు పార్టీల నాయకులు నివాళులర్పించారు. మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపీపీ మృతదేహానికి మంగళవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, కాంగ్రెస్ నాయకులు రవికుమార్, వెంకటేష్‌నాయుడు, మధుసూదన్‌రెడ్డి, తిరుపతయ్యసాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరసాగర్, చంద్రశేఖర్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు సమావేశం

వీపనగండ్ల: ఉపాధిహామీ పథకం ద్వారా వివిధ గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలపై చర్చించేందుకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఓ శేఖర్‌గౌడ్ తెలిపారు. 2024–25 ఉపాధి పనుల్లో పురోగతిని సమీక్షించామని తెలిపారు.

చెత్తను వాహనాల్లో వేయండి

వనపర్తిటౌన్: ఇంట్లో చెత్తను డ్రైనేజీలో కాకుండా మున్సిపల్ చెత్త సేకరణ వాహనాల్లో వేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయా వార్డుల్లో 100 రోజుల కార్యాచరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి పాల్గొనారు.

శాగాపూర్‌కు బస్సు పునరుద్ధరించాలి

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తి డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బాలరాజుయాదవ్ మాట్లాడుతూ.. గతంలో వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులను పాన్‌గల్ మీదుగా శాగాపూర్– కొల్లాపూర్ వరకు ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం, రాత్రి సమయాల్లో బస్సు సర్వీసులు నడుస్తుండేవన్నారు.కాంగ్రెస్ నాయకులు లింగాలనాగరాజు, కుర్మయ్య, సురేష్, కృష్ణగౌడ్, బి.నాగరాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

వనపర్తి రూరల్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా ఆరీఫుద్దీన్ అన్నారు. మంగళవారం పెబ్బేరులో 8వార్డులో ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆయన యాంటీలార్వా ఆపరేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, వార్డుఆఫీసర్లు పరమేష్, ఆశ కార్యకర్తలు సుల్తానాబేగం, రాజు, శ్రీహరి, జస్వంత్ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి మ్యాతర్ల వెంకట్రాములు అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌కి గ్రామస్తులతో కలిసి సమస్యలపై ఫిర్యాదు చేశారు. భగీరథ ట్యాంకుకు మెట్లు తుప్పు పట్టడంతో విరిగిపోయే అవకాశం ఉందన్నారు. లంబాడి తండాతో పాటు పలుకాలనీలో, డ్రైనేజీలు నిర్మించాలన్నారు.

శంకర్‌గౌడ్‌కు సన్మానం

వనపర్తిటౌన్: పలుస శంకర్‌గౌడ్ ఉపాధ్యాయుడిగా చేసిన సేవలు, సాహితీ కళావేదిక అధ్యక్షుడిగా చేస్తున్న సామాజిక సేవ ఆదర్శనీయమని నాగర్‌కర్నూల్ జిల్లా నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఉత్తమ హెచ్ఎంగా అవార్డు పొంది జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సన్మానించారు. కార్యక్రమంలో కందికొండ మోహన్, మద్దిలేటి, ఎదిరె కాశన్న, బైరోజు చంద్రశేఖర్, నిరంజనయ్య, బండారు శ్రీనివాస్, రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యం

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఫయాజ్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగరాజు అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలు వార్డుల్లో పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలో తొమ్మిదో వార్డులో ఒక వ్యక్తికి డెంగ్యూ రావడంతో సమీపంలోని ఇళ్లలో దోమల నివారణ పిచికారీ మందులను చల్లారు పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యుసుఫ్ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు వెచ్చించారు.. వదిలేశారు

- తండాలు, గ్రామాల్లో వెలగని హైమాస్ట్ లైట్లు
- పట్టించుకోని పాలకులు, విద్యుత్ అధికారులు


ఖిల్లాఘనపురం: గిరిజన తండాల్లో వెలుగునింపేందుకు ప్రభుత్వ నిధులతో మండలంలోని 13తండాల్లో రూ.19.5 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు నిరుపయోగంగా మారాయి. నేడు తండాల్లో అవి ఉత్సవ విగ్రహాల్లా దర్శన మిస్తున్నాయి. సుమారు 12 ఏళ్ల క్రితం రాజ్యసభ సభ్యుడు ఎంఏ ఖాన్ ఎంపీ నిధులు రూ.15లక్షలు, హన్మంతరావు ఎంపీ నిధులు రూ.4.5లక్షలతో మండలంలోని తిర్మలాయపల్లి రోడ్డుమీదితండా, రుక్కన్నపల్లి తండా, కర్నెతండా, కోతులకుంటతండా ఇలా 13తండాల్లో వీటిని ఏర్పాటు చేశారు. కేవలం 6నెలల పాటు వెలిగిన లైట్లు ఆ తరువాత వెలగడం లేదు. చిన్నపాటి మరమ్మతులు చేస్తే కొన్ని తండాల్లో లైట్లు వెలిగే అవకాశం ఉంది. కాగా ఆయా గ్రామ పంచాయతీల అధికారులు పట్టించుకోకపోవడంతో అవి నేడు నిరుపయోగంగా మారాయి. కొన్ని తండాల్లో వీటిని తొలిగించగా కొన్ని తండాల్లో ఉత్సవ విగ్రహాలుగా మారాయి. కనీసం వర్షాకాలం లోనైన మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాలు, తండాల ప్రజలు కోరుతున్నారు.

ఖిల్లాఘనసపురంలో..

మండల కేంద్రంలోని ప్రధాన వీదుల్లో చీకటిగా ఉందని ఆయా కాలనీల వాసులు కోరడంతో ఘనపురంలోని ప్రధాన కూడళ్లయిన బస్టాండ్, కుర్వగేరి, బెస్తగేరి, తోకగేరి, తెలుగుగేరి, కుమ్మరిగేరి ప్రాంతాల్లో 2003లో నాటి రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి రూ.6లక్షల నిధులతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసి 5 సంవత్సరాల పాటు వెలిగాయి. తరువాత వచ్చిన సర్పంచ్‌లు, పత్ర్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో నేడు అవి నిరుపయోగంగా మారాయి. ఇలా మండలంలోని తండాలు, ఘనపురం గ్రామంలో రూ.లక్షల ప్రజాధనాన్ని ఖర్చుచేసి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు ఎందుకుపనికి రాకుండా పోయాయి. కొన్ని లైట్లు తుప్పు పట్టి పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రమాదవశాత్తు రోడ్డు వెంట ఎవరైన జనాలు వెళ్తున్న సమయంలో పడిపోతే పెద్ద ప్రమాదం జరుగుతుందని ఆయా కాలనీల ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖిల్లాఘనపురం బెస్తగేరిలో నిరుపయోగంగా ఉన్న హైమాస్ట్ లైట్లు



ఖిల్లాఘనపురం తెలుగుగేరిలో వెలగని హైమాస్ట్ లైటు

జిల్లా ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించాలి

వనపర్తి: జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం ఉదయం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ సందర్శించారు. ఆస్పత్రిలో డ్రైనేజ్ పైప్‌లైన్లు మార్చడం సీసీరోడ్లు వేయడం వంటి పనులు త్వరగా పూర్తిచేయాలని వైద్య విభాగం ఏఈను ఆదేశించారు. ఆస్పత్రి మొత్తాన్ని కలియ తిరిగిన కలెక్టర్ పరిసరాల పరిశుభ్రతతో పాటు దివ్యాంగులకు సదరం క్యాంపు ఏర్పాటుకు అవసరమైన గదులను అన్వేషించారు. సదరం క్యాంపు ఏర్పాటుకు గదులు సిద్ధం చేయాలని అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా డయాలసిస్ సెంటరును మాతా శిశు ఆరోగ్య కేంద్రం వద్ద నిర్మించిన క్రిటికల్‌కేర్ యూనిట్‌కు మార్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్ఓ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు, సాయినాథ్ రెడ్డి ఉన్నారు.

నవజాత శిశువుమరణాలపై జాగ్రత్తలు తీసుకోండి

నవజాత శిశు మరణాలు కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్యఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నవజాత శిశు మరణాల వివరాలు డీఎంహెచ్ఓ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 29 మంది నవజాత శిశువులు మరణించడంపై పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రామచంద్రరావు, డాక్టర్ పరిమళ పాల్గొన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ముసురు వర్షాలతో ప్రబలుతున్న విషజ్వరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్ఓ శ్రీనివాసులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ రంగారావులు చెప్పారు. మంగళవారం జిల్లా ఆస్పత్రిలో నమోదవుతున్న విషజ్వరాల విషయమై విలేకరులతో మాట్లాడారు. ఏటేటా.. ప్రమాదకరమైన డెంగీ జ్వరాలు తగ్గుతున్నాయని, ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ డెంగీ పరీక్షలు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 7,262 మంది డెంగీ టెస్టులు చేయగా.. 49 మందికి మాత్రమే పాజిటివ్ వచ్చినట్లు వారు తెలిపారు.

బీజేపీ పట్టణ బంద్ ప్రశాంతం



కర్నూలు రోడ్‌లో మూసి ఉన్న దుకాణాలు

వనపర్తిటౌన్: బీజేపీ నాయకులపై అక్రమ కేసుల నమోదు, ప్రధాని మోదీ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో మంగళవారం జిల్లాకేంద్ర బంద్‌కు బీజేపీ పిలుపునివ్వగా ప్రశాంతంగా ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు ముందుగానే సెలవు ప్రకటించగా.. కిరాణా, వస్త్ర, వాణిజ్య, బులియన్ మర్చంట్ దుకాణాలన్నీ మూసి ఉంచారు. పెట్రోల్ బంక్‌లను సైతం బీజేపీ నాయకులు మూసి వేయించారు. బంద్‌ను విజయవంతం చేసేందుకు బీజేపీ నాయకులు ఉదయం నుంచి పట్టణ రహదారుల్లో ర్యాలీ నిర్వహిస్తూ కాంగ్రెస్, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 11 తర్వాత బీజేపీ నాయకులు నిరసనలు తెలపకుండా ఆ పార్టీ కార్యాలయంలోనే పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించిన దుండగులపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తే కేసులు నమోదు చేశారని చెప్పారు. మోదీ శవయాత్ర చేసిన కాంగ్రెస్ బాధ్యులను అరెస్ట్ చేసే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కి గట్టిగా బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, పెద్దిరాజు, కల్పన, జిల్లా ఉపాధ్యక్షుడు బాశెట్టి శ్రీనివాసులు, నాయకులు మొరార్జీ నాయక్, బాబురావు, పద్మ, కుమారస్వామి, సీతారాములు, రాంరెడ్డి, కాటమోని కృష్ణగౌడ్, శివారెడ్డి, మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, ఖలీల్, రాజశేఖర్‌గౌడ్, సూగూరు రాములు, దంతోజ్ నవీన్, ఉండెకోటి అంజి, రాయన్న సాగర్, విజయ్, కడమంచి శివ తదితరులు పాల్గొన్నారు.

'కాళేశ్వరంపై కాంగ్రెస్ విషప్రచారం తగదు'



కొత్తకోట నిరసనలో పాల్గొన్న నాయకులు



గోపాల్‌పేటలో మాట్లాడుతున్న నాయకులు



ఆత్మకూర్‌లో..

కొత్తకోట: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే విష ప్రచారం చేస్తుందని, కేవలం రాజకీయ కక్షతో వ్యవహరిస్తుందని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొత్తకోట తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆల మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కుమ్మక్కై తెలంగాణ నీళ్లను తరలించేందుకు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం పెండింగ్‌లో పెట్టి గోదావరి జలాలను తరలించుకుపోవడానికి పన్నాగం పన్నుతున్నారన్నారు. యావత్ తెలంగాణ సమాజం మాజీ సీఎం కేసీఆర్ వెంటే ఉందని, అనవసరంగా బద్నాం చేసి బురద చల్లుతున్నారని ఆయన మండిపడ్డారు.

గోపాల్‌పేట: కాంగ్రెస్ నాయకులకు పాలమూరు ప్రజలపై ప్రేమ ఉంటే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలరాజు అన్నారు. ఏదులలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేసీఆర్ చేసిన మంచి పనులను ఓర్చుకోలేక సీబీఐకి అప్పగించి పైశాచిక ఆనందం పొందుతున్నారు.

ఆత్మకూర్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని కేసీఆర్‌పై కుట్రలు మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం గాంధీచౌక్‌లో బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవికుమార్‌యాదవ్, వీరేషలింగం, లక్ష్మీకాంత్‌రెడ్డి, కోటేష్, రియాజ్, అంజీ, భీమన్న, జహంగీర్, కర్రెశ్రీను, వేణురెడ్డి, లక్ష్మన్న ఉన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

పాన్‌గల్: దాడి సంఘటనలో మంగళవారం ఇద్దరిపై కేసు నమోదైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. చింతకుంట గ్రామానికి చెందిన శ్రీనివాసులు, తిరుపతయ్య ఇద్దరు సోదరులు సర్వే నెం.54,52లో ఉన్న పొలంలో ఒక్కొక్కరికి 4–30 ఎకరాల పొలం ఉన్నది. ఈ పొలంను నెల క్రిందటనే పంచుకున్నారు. మంగళవారం శ్రీనివాసులు, అతడి భార్య లక్ష్మీదేవమ్మ, కుమారుడు ముగ్గురు కలిసి పొలంలో పనులు చేసుకుంటుండగా సోదరుడు తిరుపతయ్య, అతని భార్య అనంతమ్మ ఇద్దరు కలిసి శ్రీనివాసులు పొలంలోకి ప్రవేశించి విత్తనాలు వేసే ప్రయత్నం చేయగా ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇదేక్రమంలో తిరుపతయ్య, అనంతమ్మ ఇద్దరు కలిసి లక్ష్మీదేవమ్మను దూషిస్తూ కట్టెతో, రాయితో దాడిచేసి గాయపర్చారన్నారు. అడ్డొచ్చిన శ్రీనివాసులు, కుమారుడు ఆంజనేయులపై కట్టెతో, రాయితో దాడి చేసి గాయపర్చారన్నారు. అకారణంగా మా పొలంలోకి వచ్చి మాపై దాడిచేసి గాయపర్చిన తిరుపతయ్య, అనంతమ్మపై తగు చర్యలు తీసుకోవాలని లక్ష్మీదేవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా మద్దులేశ్వరి మాత బోనాలు



అమరచింత: పట్టణంలోని మద్దులేశ్వరి మాత బోనాల ఉత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణానికి చెందిన పద్మశాలి కులస్థులు భక్త మార్కండేయ ఆలయం నుంచి అమ్మవారి బోనంను భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మద్దులేశ్వరి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రోచ్చరణ మధ్య పసుపు బండారంను చల్లుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించి నైవేద్యంతో తమ మొక్కులను చెల్లించుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైయ్యారని ఇచ్చిన హామీలను వెంటనే పూర్తి చేయాలని మంగళవారం బీజేపీ నాయకులు స్థానిక తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఆవుల నారాయణ మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు అమలుచేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు నరేష్‌యాదవ్, మండల కార్యదర్శి శివ, విష్ణు, జగదీశ్వర్‌గౌడ్, కృష్ణయ్య, లక్ష్మణ్, హరికృష్ణ, రవీందర్ పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

రిజర్వాయర్ లింక్ పనులు ప్రారంభం

వీపనగండ్ల: సింగోటం రిజర్వాయర్ నుంచి గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు నిర్మించనున్న లింక్‌కెనాల్ పనులు ఎట్టకేలకు ప్రారంభించడంతో రైతులు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ పాలనలో రూ.147కోట్లతో 23కి.మీ.ల లింక్ కెనాల్‌ను నిర్మించి చిన్నంబావి, వీపనగండ్ల, పెంట్లవెల్లి గ్రామాల్లోని రైతులకు సాగునీరు అందిచాల్సి ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో అప్పటి కాంట్రాక్టర్ పూర్తిస్థాయి పనులు చేపట్టకుండా వెళ్లిపోయారు. రెండు నెలల క్రితం మంత్రి జూపల్లి కృష్ణారావు కాల్వ నిర్మాణ పనులను పునర్ ప్రారంభించగా రెండురోజులు పనులు కొనసాగి నిలిచిపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. మంగళవారం కాల్వపనులు ప్రారంభించేందుకు అధికారులు సర్వే పనులు ప్రారంభించడంపై రైతులు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వసతిగృహాల తనిఖీ

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని బీసీ వసతి గృహాలను బీసీ సంక్షేమ అధికారి ముజాహిద్దీన్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బాలుర, బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. వార్డెన్లకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అధికారుల సూచించారు.

ఓటరు జాబితా ప్రదర్శన

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం గ్రామంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డులో పూర్తిస్థాయి ఓటరు జాబితాను పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, బీఎల్ఓలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు లావణ్య, అరుణ, శైలజ, ఉమాదేవి తదితరలు పాల్గొన్నారు.

అమరచింత: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మంగళవారం ఓటరు తుది జాబితాను ఎంపీడీఓ శ్రీనివాసులు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నోటీసు బోర్డుపై ఉంచారన్నారు. పంచాయతీ కార్యదర్శి కార్యాలయంలో నోటీస్ బోర్డుపై జాబితాను ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా బీఎల్ఓలు సరిచూసుకోవాలని తహసీల్దార్ సరస్వతి సూచించారు. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు.

అభివృద్ధికి నోచుకోని దళితవాడ

వనపర్తి రూరల్: సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని 21వార్డులోని దళితవాడలో పలు సమస్యలపై సర్వే నిర్వహి ంచారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి పాల్గొని మాట్లాడారు. డ్రైనేజీ పనులు పూర్తి కాకపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి సమస్యలపై దృష్టి సారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.కురుమయ్య, రాబర్ట్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం పెంపుపై హర్షం

కొత్తకోట రూరల్: బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద మరణానికి సాధారణ మరణానికి నష్టపరిహాలు పెంచాలని అనేకసార్లు చేసిన పోరాటాల ఫలితమే ప్రమాద మరణానికి రూ.10లక్షలు సాధారణ మరణానికి రూ.2లక్షలు పెంచుతూ జీవో నెంబర్ 12 ను రిలీజ్ చేశారని జిల్లా ప్రధాన కార్యదర్శి నిక్సన్ అన్నారు. మంగళవారం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లిలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కే.వెంకటయ్య, జి.బాబు, ఆంజనేయులు, ఎం.శివకుమార్, పి.తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

బాలలు బడిలో ఉండాలి

వనపర్తి రూరల్: బాలలు బడిలో ఉండాలని ఎస్ఐ జలంధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మంగళవారం హెచ్ఎం గణేష్‌కుమార్ అధ్యక్షతన గ్రామస్థాయి బాలల సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్ఐ జలంధర్‌రెడ్డి, జిల్లా బాలల హక్కుల సంరక్షణ కమిటీ అధికారి యాదమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కురుమయ్య, హెచ్ఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యువతకు పెద్ద పీట

మదనాపురం: రానున్న రోజుల్లో కాంగ్రెస్ యువతకు పెద్దపీట వేస్తుందని రాష్ట్రయూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కృష్ణవర్ధన్‌రెడ్డి మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క శ్రీనివాస్ నాయుడు వెల్లడించారు. తిర్మలాయపల్లి యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా రవి, ఉపాధ్యక్షుడిగా నరేష్, రామన్ పాడ్ అధ్యక్షుడిగా నందునాయక్, ఉపాధ్యక్షుడిగా రాంబాబును నియమించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సుక్కమహేష్, అంజద్అలీ పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న గణపయ్య

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలో భక్తులు భక్తిపారవశ్యంతో గణనాథుడిని పూజించారు. మంగళవారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.



పాన్‌గల్ కమ్యూనిటీ హాల్ వద్ద అన్నదానం



పాన్‌గల్‌లోని పెద్దమ్మ గుడి వద్ద..

మహానేత వైఎస్సార్‌ను మరువలేం



కొత్తకోటలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకుల నివాళి

గోపాల్‌పేట: మహానేత మరణించినా ఆయన తీసుకొచ్చిన పథకాలు మరువలేరని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని రావిచెట్టు వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ శివన్న, జిల్లా ఎస్సెసెల్ ప్రెసిడెంట్ వెంకటేష్, శేఖర్, జిల్లా ఆర్టీఐ చైర్మన్ కొంకిరమేష్, వెంకటయ్య, బాలయ్య, కోదండం పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ చుక్క మహేష్ పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: పెబ్బేరులో సుభాష్‌చౌరస్తాలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్ఆర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లిచౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు సాయిచరణ్‌రెడ్డి సింగిల్‌విండో వైస్‌చైర్మన్ క్యామరాజు, నాగేశ్వర్, ఆగారం ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

అమరచింత: మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు మరువలేరని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్‌లు అన్నారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వర్ధంతి నిర్వహించారు, ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ శ్యామ్, నాయకులు తిరుమలేష్, తౌఫిక్, హనుమంతు నాయక్, లక్ష్మీకాంత్ రెడ్డి, హరీష్‌నాయక్ పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ పి.ప్రశాంత్, ఎన్‌జే బోయేజ్, పి.కృష్ణారెడ్డి, డాక్టర్ పీజే బాబు, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, నారాయణ, నరేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, జీఎం,మీషేక్, కృష్ణారెడ్డి, నరేందర్‌సాగర్, పెంటన్నయాదవ్, లతీఫ్ పాల్గొన్నారు.



పెబ్బేరులో..



మదనాపురంలో..



ఖిల్లాఘనపురంలో..



అమరచింతలో..